www.prajasakti.com
ప్రజాశక్తి
మంగళవారం 31 డిసెంబర్ 2024



నేడు ఎన్‌టిఆర్‌ భరోసా పింఛన్ల పంపిణీ

ప్రజాశక్తి - కాకినాడ

జిల్లాలో డిసెంబర్‌ 31న ఎన్‌టిఆర్‌ భరోసా పింఛన్ల పంపిణీకి సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కలెక్టర్‌ షాన్‌ మోహన్‌ సగిలి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సామాజిక భద్రత కింద ప్రతినెల అందిస్తున్న పింఛన్లను రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఒకరోజు ముందుగా పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. జిల్లాలో 2, 73, 202 మందికి రూ.116.08 కోట్లను పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. మంగళవారం ఉదయం 6 గంటల నుంచి పింఛన్ల పంపిణీ చేయాలన్నారు. నూరు శాతం పింఛన్ల పంపిణీ పూర్తి చేసేందుకు క్షేత్రస్థాయిలో అధికారులు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఇందుకోసం మండల స్థాయి అధికారులు, సచివాలయం సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు.



2024 స్మృతి కవనం...

కొంత ఖేదం.. కొంత మోదం.. సుఖ సంతోషాలు, కష్టనష్టాలను పంచిన ఈ ఏడాది మరో కొన్ని గంటల్లో కాలగమనంలో కలిసిపోనుంది. మంచి చెడులను మనకే వదిలేసి మాయమైపోనుంది. జరిగిన తప్పుల నుంచి గుణపాఠాలు నేర్చుకుని మంచిగా జీవించాలనే సందేశాన్నిచ్చింది. ఎన్నో ఉద్యమాలకు ఊపిరి పోసింది. రాజకీయ మార్పులకు వేదికైంది. ఎన్నో స్మృతులను తనలో నిక్షిప్తం చేసుకుంది. ఆ స్మృతుల కవనం ఒకసారి ...

జనవరి 2024



అంగన్‌'వేదన'

సమస్యలు పరిష్కరించాలని, హామీలను అమలు చేయాలంటూ అంగన్‌వాడీలు సుదీర్ఘ పోరాటం చేశారు. ఎస్మాను ప్రయోగించినా భయపడకుండా పోరాటాన్ని కొనసాగించారు. 22న 'ఛలో విజయవాడ' నేపథ్యంలో అంగన్‌వాడీలను పోలీసులు నిర్బంధించారు.

10న తునిలో, 20న మండపేటలో, 29న రాజమహేంద్రవరంలో టిడిపి అధినేత నారా చంద్రబాబునాయుడు బహిరంగ సభలు నిర్వహించారు.

14న ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా వ్యాప్తంగా కోడిపందేలు యథావిధిగా జరిగాయి. పోలీసులు ప్రేక్షక పాత్రకే పరిమితమయ్యారు. ఎన్నికల సంవత్సరం కావడంతో విపరీతంగా బరులు వెలిశాయి. 29న రాజమహేంద్రవరంలో 'రా.. కదలిరా' సభలో టిడిపి అధినేత చంద్రబాబు పాల్గొన్నారు.

12న తుది ఓటర్ల జాబితాను ఎన్నికల సంఘం విడుదల చేసింది

ఫిబ్రవరి 2024



కాంగ్రెస్‌ జోరు

7న డిఎస్‌సిని ప్రకటించాలంటూ డివైఎఫ్‌ఐ ఆధ్వర్యంలో నిరుద్యోగులు ధర్నాలు నిర్వహించారు.

9న రాజమండ్రిలో పిసిసి అధ్యక్షురాలు వైఎస్‌.షర్మిల పర్యటించారు. 16న కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ దేశవ్యాప్త పిలుపులో భాగంగా రాజమహేంద్రవరం పోస్టాఫీసు నుంచి కోటగుమ్మం సెంటర్‌ వరకూ కేంద్ర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన జరిగింది. సిఐటియు, ఎఐటియుసి, ఐఎఫ్‌టియు సంఘాలు పాల్గొన్నాయి.

20న రాజమహేంద్రవరంలోని ఎవి.అప్పారావు రోడ్డులో ఉన్న జనసేన జిల్లా కార్యాలయంలో జనసేన నాయకులు, కూటమి నాయకులతో జనసేన అధినేత పవన్‌కళ్యాణ్‌ సమావేశమయ్యారు.

22న గోపాలపురం మండలంలో దూడపై పులిదాడి చేసినట్టు అటవీశాఖ అధికారులు ధ్రువీకరించారు.

మార్చి 2024



మోగిన నగరా...

మార్చి 16న ఎపి అసెంబ్లీ స్థానాలు, ఎంపీ స్థానాలకు ఎన్నికల కమిషన్‌ నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. దీంతో ఎన్నికల కోడ్‌ అమల్లోకి వచ్చింది. అయితే అంతకు ముందు నుంచే జిల్లాలో ఎన్నికల సందడి మొదలైంది. ఆయా పార్టీలు అభ్యర్థులను ప్రకటించడంతో పాటూ ముందస్తుగా ప్రచారాన్ని నిర్వహించాయి. 23న కాకినాడ ఎంపీ, 24న రాజమండ్రి ఎంపీ స్థానాలకు కూటమి అభ్యర్థులను ప్రకటించింది. 26న టిడిపి పొలిట్‌ బ్యూరో సభ్యునిగా రెడ్డి సుబ్రహ్మణ్యం నియమితులయ్యారు. టిడిపి జాతీయ కార్యదర్శిగా మాజీ మంత్రి జవహర్‌ను నియమించారు.

27న అనపర్తి బిజెపి అభ్యర్థిగా మాజీ సైనికుడు శివకృష్ణంరాజు పేరును ప్రకటించారు.

30న కాకినాడ జిల్లా పిఠాపురంలో జనసేన అధినేత పవన్‌ కళ్యాణ్‌ పర్యటించారు. ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు.

ఏప్రిల్‌ 2024



ఎట్టకేలకు తీర్పు

రాష్ట్రంలో సంచలనం సృష్టించిన వెంకటాయపాలెం శిరోముండనం కేసులో నేరం రుజువు కావడంతో ఎంఎల్‌సి తోట త్రిమూర్తులుకు విశాఖపట్నంలోని ఎస్‌సి, ఎస్‌టి ప్రత్యేక న్యాయస్థానం 18 నెలల జైలు, జరిమానా విధిస్తూ ఏప్రిల్‌ 16న తుది తీర్పును వెలువరించింది. అయితే అదే రోజున ఆయన బెయిల్‌పై బయటకు వచ్చారు. 25న రాజమహేంద్రవరంలోని ఆంధ్రా పేపరుమిల్లుకు యాజమాన్యం లాకౌట్‌ ప్రకటించింది. వివిధ పార్టీల అధినేతలు జోరుగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. వైసిపి అధినేత జగన్‌, టిడిపి అధినేత చంద్రబాబు, జనసేన అధినేత పవన్‌కళ్యాణ్‌లు బహిరంగ సభలు, రోడ్‌ షోలను నిర్వహించారు. 16న రాజమండ్రిలోని ఆనం రోటరీ హాల్లో నిర్వహించిన ప్రజాస్వామ్య పరిరక్షణ సభలో సిపిఎం, సిపిఐ రాష్ట్ర కార్యదర్శులు వి.శ్రీనివాసరావు, కె.రామకృష్ణ పాల్గొన్నారు.

మే 2024



'ఓటె'త్తారు...

మేలో ఎండల వేడిమికి ఎన్నికల సెగ తోడవ్వడంతో జిల్లాలో వాతావరణం వేడెక్కింది. పోలింగ్‌ తేదీ దగ్గర పడటంతో ఆయా పార్టీలు ముమ్మరంగా ప్రచారం నిర్వహించాయి. 7న రాజమహేంద్రవరంలో నిర్వహించిన సభలో ప్రధాని మోడి, జనసేన అధినేత పవన్‌కళ్యాణ్‌ పాల్గొన్నారు. ఏప్రిల్‌ 13న ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పోలింగ్‌ ప్రశాంతంగా జరిగింది. కాకినాడ జిల్లాలో 76.37, తూర్పు గోదావరి జిల్లాలో 79.43, డాక్టర్‌ బిఆర్‌.అంబేద్కర్‌ కోనసీమ జిల్లాలో 81.68 శాతం ఓటింగ్‌ నమోదైంది. ఇవిఎంలను నన్నయ యూనివర్శిటీలో ఏర్పాటు చేసిన కౌంటింగ్‌ కేంద్రానికి తరలించారు. 19న కోనసీమ జిల్లా రావులపాలెంలోని గౌతమి గోదావరిలో స్నానానికి దిగి ఇద్దరు యువకుల మృత్యువాత, మరొకరు గల్లంతు. 26న రాజమహేంద్రవరంలో దంపతుల అనుమానాస్పద మృతి సంచలనంగా మారింది.


జూన్‌ 2024



కొలువుదీరిన కొత్త ప్రభుత్వం

జూన్‌లో కొత్త ప్రభుత్వం కొలువు దీరింది. 4వ తేదీన నన్నయ యూనివర్శిటీలో ఎన్నికల కౌంటింగ్‌ ప్రారంభమైంది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో కూటమి క్లీన్‌ స్వీప్‌ చేసింది. అన్ని స్థానాల్లో హవా చాటింది. వార్‌ వన్‌సైడ్‌ అన్నట్టుగా మూడు జిల్లాల్లో మొత్తం 21 స్థానాలను కైవసం చేసుకుంది. వీటిలో టిడిపి అభ్యర్థులు 14 స్థానాల్లో, జనసేన అభ్యర్థులు 6 స్థానాల్లో, బిజెపి అభ్యర్థి ఒక స్థానంలో విజయకేతనం ఎగురు వేశారు. అధికార వైసిపి పార్టీ ఘోర పరాజయం పొందింది. కాకినాడ, రాజమండ్రి, అమలాపురం పార్లమెంటు స్థానాలను సైతం కూటమి తన ఖతాలో జమేసుకుంది. 12న కేబినేట్‌ ఎన్నిక జరిగింది. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా నుంచి కూటమి ప్రభుత్వంలోకి జనసేన అధినేత పవన్‌ కల్యాణ్‌, కందుల దుర్గేష్‌, వాసంశెట్టి సుభాష్‌లకు చోటు దక్కింది. 23న జిల్లా కలెక్టర్లను మార్పు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

జులై 202



వరదపోటు

జులై 3న కాకినాడ జిల్లాలో ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌ పర్యటించారు. పలు ముఖ్య శాఖల అధికారులతో సమీక్షా సమావేశాలు నిర్వహించారు.

9న కాకినాడ జిల్లా తాళ్లరేవు మండల పరిధిలోని కోరంగి వన్యప్రాణి అభయారణ్యంలో నీటి పిల్లులు గణనపై అటవీశాఖ దృష్టి సారించింది. వీటి గణనకు ప్రత్యేక కార్యాచరణను రూపొందించింది.

18న జెఎన్‌టియుకె ఇన్‌ఛార్జి విసిగా కెవిఎస్‌జి.మురళీకృష్ణను, నన్నయ విశ్వవిద్యాలయం ఇన్‌ఛార్జి విసిగా వై.శ్రీనివాసరావును నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీగా చేసింది.

28న గోదావరికి భారీగా వరద పోటెత్తింది. కోనసీమ లంకలను ముంచెత్తింది. గోదావరిని ఆనుకుని ఉన్న పల్లపు ప్రాంతాలు, పంటలు నీట మునిగాయి.

ఆగస్టు 2024



సినిమా చెట్టు ఇక లేదు

ఆగష్టు 5న కొవ్వూరు మండలం కుమారదేవంలో గోదావరి ఒడ్డున ఉన్న సినిమా చెట్టు నేలకొరిగింది. ఈ వృక్షం వయసు 150 సంవత్సరాలు. ఈ చెట్టు వద్ద అనేక సినిమా షూటింగ్‌లు జరిగాయి.

సమస్యలను పరిష్కరించాలంటూ స్కీమ్‌ వర్కర్లు కలెక్టరేట్లను ముట్టడించారు. భారీగా కార్మికులు పాల్గొన్నారు.

23న సిఎం చంద్రబాబు డాక్టర్‌ బిఆర్‌.అంబేద్కర్‌ కోనసీమ జిల్లా కొత్తపేట మండలం వానపల్లిలో పర్యటించారు. గ్రామసభలో పాల్గొన్నారు. పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేశారు.

31న పుష్కరాలు-2027కు సంబంధించి కలెక్టర్‌ అధ్యక్షతన సమీక్షా సమావేశం జరిగింది. రైల్వేస్టేషన్‌ను రూ.240 కోట్లతో అభివృద్ధి చేయాలని నిర్ణయించారు.

సెప్టెంబర్‌ 2024



ఏలేరు ఉగ్రరూపం

సెప్టెంబర్‌ 2న గోదావరికి మరోసారి వరదలు వచ్చాయి. దీంతో పలుచోట్ల పొలాలు, లోతట్టు ప్రాంతాలు నీటమునిగాయి. 8న రాజమహేంద్రవరంలో పులి సంచారం కలకలం సృష్టించింది. 10 రోజుల పాటు సంచరించి చివరికి కనిపించకుండా మాయమైంది. 10న ఏలేరు ఉగ్రరూపం దాల్చింది. ఏలేరు పరివాహక ప్రాంతాలను ముంచెత్తింది. వరద ముంపు ప్రాంతాల్లో 11న సిఎం చంద్రబాబు పర్యటించారు. 12న దేవరపల్లి మండలం చిన్నాయిగూడెం శివారు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఏడుగురు కూలీలు మృతి చెందారు. వీరంతా నిడదవోలు మండలానికి చెందినవారు.

సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారం ఏచూరి మరణంతో జిల్లాలో విషాదం నెలకొంది. ఆయన కాకినాడకు చెందిన వారు. ఈ సందర్భంగా పలువురు సంతాపం వ్యక్తం చేశారు

అక్టోబర్‌ 2024



ఇసుక పోరు

4న ఉచిత ఇసుక కోసం భవన నిర్మాణ రంగ కార్మికులు వివిధ రూపాల్లో నిరసనలు తెలిపారు.

16న జిల్లా ఇన్‌ఛార్జ్‌ మంత్రులన్ను ప్రభుత్వం నియమించింది. డాక్టర్‌ బిఆర్‌ అంబేద్కర్‌ కోనసీమ జిల్లా ఇన్‌ఛార్జ్‌ మంత్రిగా కింజరాపు అచ్చెన్నాయుడు, కాకినాడ జిల్లా ఇన్‌ఛార్జ్‌ మంత్రిగా నారాయణ, తూర్పు గోదావరి జిల్లా ఇన్‌ఛార్జ్‌ మంత్రిగా నిమ్మల రామానాయుడు నియమితులయ్యారు.

21న వాలంటీర్‌ హత్య కేసులో మాజీ మంత్రి పినిపే విశ్వరూప్‌ కుమారుడు పినిపే శ్రీకాంత్‌ను పోలీసులు అరెస్టు చేశారు.

27న గోకవరం మండలం గుమ్మళ్లదొడ్డిలో ఉన్న అస్సాగో ఇథనాల్‌ పరిశ్రమ కాలుష్యాన్ని వ్యతిరేకిస్తూ గ్రామస్తులు చేపట్టిన ఆందోళనపై పోలీసులు లాఠీఛార్జ్‌ చేశారు. నిరవధిక నిరహరదీక్ష చేస్తున్న ఉద్యమకారులను బలవంతంగా అరెస్టు చేశారు.

నవంబర్‌ 2024



దారుణం

1న కాజులూరు మండలం శెలపాక గ్రామంలో ముగ్గురు దారుణ హత్యకు గురయ్యారు. వివాహేతర సంబంధం విషయంలో బత్తుల చిన్నయ్య, పొట్లకాయల నాగేశ్వరరావు కుటుంబాల మధ్య పాత కక్షలు ఉన్నాయి. ఈ నేపథ్యంలోనే బత్తుల చిన్నయ్య, బత్తుల రాజు, బత్తుల రమేష్‌లను అతిదారుణంగా హత్య చేశారు.

2న కడియం మండలం బుర్రిలంకలో ఒడిసాకు చెందిన మహిళపై ముగ్గురు అత్యాచారానికి పాల్పడి, హత్య చేశారు.

5న ఉండ్రాజవరం మండలం తాడిపర్రులో ఫ్లెక్సీ కడుతూ విద్యుత్‌ షాక్‌కు గురియై నలుగురు యువకులు మృతి చెందారు.

10న కుడా, రుడా ఛైర్మన్లుగా తుమ్మల రామస్వామి, బొడ్డు వెంకటరమణ చౌదరి నియమితులయ్యారు.

13న శాసన సభ విప్‌లుగా ఎంఎల్‌ఎలు యనమల దివ్య, దాట్ల సుబ్బరాజు నియామకం.

డిసెంబర్‌ 2024



సమరోత్సాహం

సిపిఎం మూడు జిల్లాల మహాసభలు ఉత్సాహభరిత వాతావరణంలో సాగాయి. సిపిఎం శ్రేణుల్లో సమరోత్సాహాన్ని నింపాయి. ప్రజా సమస్యలపై సమగ్రంగా చర్చించి చేపట్టేబోయే ప్రజాపోరాటాలకు దిశానిర్దేశం చేశాయి. కాకినాడ సిపిఎం జిల్లా కమిటీ 11 మందితో, డాక్టర్‌ బిఆర్‌.అంబేద్కర్‌ కోనసీమ జిల్లా కన్వీనింగ్‌ కమిటీ ఏడుగురితో, తూర్పు గోదావరి జిల్లా కమిటీ 12 మందితో ఏర్పాటైంది. కాకినాడ జిల్లా కార్యదర్శిగా కరణం ప్రసాదరావు, తూర్పు గోదావరి జిల్లా కార్యదర్శిగా టి.అరుణ్‌, డాక్టర్‌ బిఆర్‌.అంబేద్కర్‌ కోనసీమ జిల్లా కన్వీనర్‌గా కారం వెంకటేశ్వరరావు ఎన్నికయ్యారు.

టీచర్స్‌ ఎంఎల్‌సి ఎన్నికల్లో పిడిఎఫ్‌ అభ్యర్థి బొర్ర గోపిమూర్తికి గురువులు ఘన విజయాన్ని అందించారు. మొదటి ప్రధాన ఓటుతోనే భారీ విజయాన్ని కట్టబెట్టారు.

అమిత్‌ షాను బర్తరఫ్‌ చేయాలి

-వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో జరిగిన ధర్నాల్లో డిమాండ్‌

రాజ్యాంగ నిర్మాత డాక్టర్‌ బిఆర్‌.అంబేద్కర్‌ పట్ల పార్లమెంట సాక్షిగా కేంద్ర హోంశాఖా మంత్రి అమిత్‌ షా చేసి అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా వామపక్ష పార్టీలు ఇచ్చిన పిలుపులోభాగంగా సోమవారం జిల్లాలోని పలు ప్రాంతాల్లో ధర్నాలు నిర్వహించారు. తక్షణమే అమిత్‌ షాను మంత్రి పదవి నుంచి బర్తరఫ్‌ చేయాలని డిమాండ్‌ చేశారు.

ప్రజాశక్తి - యంత్రాంగం

కాకినాడ కలెక్టరేట్‌ వద్ద వామపక్షాల ఆధ్వర్యంలో ధర్నా జరిగింది. తొలుత ఇంద్రపాలెం వంతెన అంబేద్కర్‌ విగ్రహం వరకూ ప్రదర్శన నిర్వహించి, అంబేద్కర్‌ విగ్రహానికి వామపక్షాల నాయకులు పూలమాల వేసి జోహార్లు అర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి కరణం ప్రసాదరావు, సిపిఐ జిల్లా కార్యదర్శి కె.బోడకొండ, సిపిఐ (ఎంఎల్‌) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి జె.వెంకటేశ్వర్లు, సిపిఐ (ఎంఎల్‌) లిబరేషన్‌ నాయకులు సిహెచ్‌.నాగేశ్వరరావు, ఆంధ్రప్రదేశ్‌ రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్షుడు వల్లూరి రాజుబాబు, ఆలిండియా ఫార్వర్డ్‌ బ్లాక్‌ నాయకులు కొంకి రవి తదితరులు మాట్లాడారు. అంబేద్కర్‌ నిమ్న వర్గాలకే పరిమితం చేయరాదని, దేశంలో సకల రంగాల అభివృద్ధిలో అంబేద్కర్‌ ఆలోచన ఉందన్నారు. పార్లమెంట్‌లో అమిత్‌ షా చేసిన వ్యాఖ్యలు యథాలాపంగా వచ్చినవి కాదని, బిజెపి ఉద్దేశపూర్వకంగానే రాజ్యాంగంపై దాడి చేస్తోందన్నారు. అందుకు అమిత్‌ షా వ్యాఖ్యలు పరాకాష్టగా నిలిచారన్నారు. ప్రజాస్వామిక వాదులు, దేశహితం కోరుకునే ప్రతిఒక్కరూ బిజెపి సిద్ధాంతాన్ని వ్యతిరేకించాలన్నారు. అమిత్‌ షాను పార్లమెంటు నుంచి బర్తరఫ్‌ చేయాలని డిమాండ్‌ చేశారు. ఈ కార్యక్రమంలో దళిత సంఘాల నేతలు అయితాబత్తుల రామేశ్వరరావు, బొజ్జ అశోక్‌, పిల్లి రామారావు, టి.నూకరాజు, కమిడి రవికుమార్‌, దోకుబుర్ర భద్రం, సిపిఐ నాయకులు తోకల ప్రసాద్‌, పప్పు ఆదినారాయణ, సత్యనారాయణ, రామయ్య, సిపిఐ (ఎంఎల్‌) న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు మరుకుర్తి ఏసు, గుబ్బల ఆదినారాయణ, ఆర్‌.రాఘవులు, జి.దుర్గారావు, శ్రీపాదం సత్తిబాబు, నోవహు, ఎల్లారావు, అనూక్‌, సిపిఐ (ఎంఎల్‌) లిబరేషన్‌ నాయకులు ఏగుపాటి అర్జునరావు, నర్సింహారావు, ఆంధ్రప్రదేశ్‌ రైతు కూలీ సంఘం నాయకులు ఎల్లే సత్తిబాబు, మడికి సత్యం, యేసు, సిపిఎం నాయకులు ఎం. రాజశేఖర్‌, దువ్వా శేషబాబ్జీ, పలివెల వీరబాబు, సిహెచ్‌.రాజ్‌కుమార్‌, మలక వెంకటరమణ, మేడిశెట్టి వెంకటరమణ, కె.సత్తిరాజు, సిహెచ్‌.అజయ్‌ కుమార్‌, టి.రాజా, విజయ్‌కుమార్‌, రామకృష్ణ, ఈశ్వరి, రాణి, భూలక్ష్మి పాల్గొన్నారు. **పిఠాపురం** సిపిఎం ఆధ్వర్యంలో స్థానిక తహశీల్దార్‌ కార్యాలయం వద్ద ధర్నా జరిగింది. ఈ ధర్నాలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు దువ్వా శేషబాబ్జి పాల్గొని మాట్లాడారు. అంబేద్కర్‌ ప్రతిమకు అమిత్‌ షా క్షమాపణ చెప్పాలని డిమాండ్‌ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కన్వీనర్‌ కుంచె చిన్న, నాయకులు కోనేటి రాజు, మణి, విశ్వనాథం, జి.వీరబాబు, గోవిందాచారి, డి.గోపాలకృష్ణ, వి.సూర్యనారాయణ, డి.నాగేశ్వరరావు, ఎస్‌.శ్రీను, వి.నాగు పాల్గొన్నారు. **సామర్లకోట** సిపిఎం సామర్లకోట పట్టణ కమిటి ఆధ్వర్యంలో స్థానిక తహశీల్దార్‌ కార్యాలయం వద్ద ధర్నా జరిగింది. ఈ ధర్నాలో సిపిఎం జిల్లా కమిటి సభ్యులు నీలపాల సూరిబాబు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు కరణం గోవిందురాజు, కె.ఏడుకొండలు, బాలం హరి, డివైఎఫ్‌ఐ నాయకులు ఐటి వీరబాబు, కూనిరెడ్డి అప్పన్న, దారపురెడ్డి క్రాంతి, నరసింహ మూర్తి, అరుణ్‌ తదితరులు పాల్గొన్నారు. **పెద్దాపురం** సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో స్థానిక మున్సిపల్‌ సెంటర్లోని అంబేద్కర్‌ విగ్రహం వద్ద ధర్నా నిర్వహించారు. సిపిఎం మండల కార్యదర్శి డి.క్రాంతికుమార్‌ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు నీలపాల సూరిబాబు, కూనిరెడ్డి అప్పన్న, సిరపరపు శ్రీనివాస్‌, దారపురెడ్డికృష్ణ, రొంగల వీర్రాజు, నరసింహమూర్తి, మహపాతిన రాంబాబు, యాసలపు రమేష్‌, సిరపరపు మరిడియ్య, అరుణ్‌, గూనూరి వెంకటరమణ, వడ్డి సత్యనారాయణ పాల్గొన్నారు. **తుని** సిపిఎం ఆధ్వర్యంలో పట్టణంలోని గొల్ల అప్పారావు సెంటర్లో ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు నకెళ్ల శ్రీనివాస్‌, కామేశ్వరి, సత్యాకదేవి, రమణ, లక్ష్మణ్‌, తదితరులు పాల్గొన్నారు. **తాళ్లరేవు** స్థానిక తహశీల్దార్‌ కార్యాలయం వద్ద సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. తహశీల్దార్‌ సూరిబాబుకు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు టేకుమూడి ఈశ్వర రావు, వల్లు రాజబాబు, నేరేడిమిల్లి త్రిమూర్తులు, దుప్పి అదృష్టదీపుడు, పాలెపు ఈశ్వరరావు, సత్తిరాజు, ప్రజా సంఘాల నాయకులు వడ్డి ఏడుకొండలు, ఎలిపే నాగేశ్వరరావు, విప్పర్తి శ్రీనివాసరావు, గోడి భాస్కరరావు, నల్లి ఈశ్వరరావు, మంగయ్యమ్మ, పద్మ సత్య దీపిక, సింహాచలం, చెన్నయ్య పాల్గొన్నారు. **కోటనందూరు** సిఐటియు ఆధ్వర్యంలో స్థానిక తహశీల్దార్‌ కార్యాలయం వద్ద ధర్నా జరిగింది. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఎస్‌కె.పద్మ, సత్యవతి, లోవదుర్గ, కుమారి తదితరులు పాల్గొన్నారు. **జగ్గంపేట** ఎపి రైతు కతాలీసంఘం ఆధ్వర్యంలో జగ్గంపేట శివారు రంగవల్లి నగర్‌లో ధర్నా జరిగింది. ఈ కార్యక్రమంలో ఎపి ఆర్‌సిఎస్‌ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు, నాయకులు సురేష్‌, కొండెపూడి మంగమ్మ, కరుణ, రామారావు తదితరులు పాల్గొన్నారు. **యు. కొత్తపల్లి** స్థానికి సిపిఎం, లిబరేషన్‌ ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు జి.బేబీరాణి, లిబరేషన్‌ పార్టీ జిల్లా నాయకులు గొడుగు సత్యనారాయణ పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి గురాల అప్పారావు, చంద్రమళ్ల పద్మ, లిబరేషన్‌ మండల కార్యదర్శి శీలం అప్పలరాజు, సిపిఎం మండల నాయకులు కాళ్ళ నాగేశ్వరరావు, చీకట్ల సాంబశివ, చిన్ని, వజ్రం శ్రీను, నారాయణ రెడ్డి, వాసు, సుబ్రహ్మణ్యం, గంగాధర్‌ పాల్గొన్నారు.



యు.కొత్తపల్లిలో ధర్నా చేస్తున్న వామపక్షాల నాయకులు



కాకినాడలో జరిగిన ధర్నాలో సిపిఎం జిల్లా కార్యదర్శి కరణం ప్రసాద్‌రావు

ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కమిటీ ఏకగ్రీవం

అధ్యక్ష, కార్యదర్శులుగా శ్రీకాంత్‌, గంగాసూరిబాబు

ప్రజాశక్తి - శంఖవరం





ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికైంది. అన్నవరంలో రెండు రోజులపాటు జరిగిన ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా మహాసభలో సోమవారం నూతన కమిటీ 20 మందితో ఎన్నిక జరిగింది. జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా శ్రీకాంత్‌, గంగా సూరిబాబు ఎన్నికయ్యారు. జిల్లా ఉపాధ్యక్షులుగా వరహాలు, వాసు, సాయిత్‌, జిల్లా సహాయ కార్యదర్శులుగా మణికంఠ, చిన్ని, సిద్దు, సంజాయ్‌, కమిటీ సభ్యులుగా వంశీ, లోవరాజు, వడ్డీ కాసులు, నాని, అరుణ్‌, లలిత, గోపాల్‌కృష్ణ, జయరాం, విపిన్‌ కుమార్‌, సంతోష్‌, అమృత ఎన్నికయ్యారు.

9 తీర్మాణాలకు ఆమోదం

ఎస్‌ఎఫ్‌ఐ 29వ జిల్లా మహాసభల్లో 9 తీర్మానాలను ఆమోదించడం జరిగింది. విద్యా హక్కు చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్‌, కాస్మోటిక్‌ చార్జీలు విడుదల చేయాలని, ప్రభుత్వ జూనియర్‌ కళాశాలకు నిధులు కేటాయించి ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులు భర్తీ చేయాలని, యూనివర్సిటీలకు నిధులు కేటాయించి, ప్రొఫెసర్‌ పోస్టులు భర్తీ చేయాలని, ఎయిడెడ్‌ కళాశాలకు ఎయిడ్‌ కొనసాగించాలని, విద్యార్థినులపై అత్యాచారాలను, దాడులను అరికట్టాలని, ఈ సంవత్సరం నుంచే అందరికీ ఫీజు రీయింబర్సెమెంట్‌, స్కాలర్‌ షిప్‌ ఇవ్వాలని, విద్యార్థి సంఘాలకు విద్యాసంస్థల్లో ఎన్నికల నిర్వహించాలని, రాష్ట్రంలో జిల్లాలో కొత్త యూనివర్సిటీలను ఏర్పాటు చేయాలనే తీర్మాణాలను మహాసభ ఆమోదించినట్లు ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి వెంకటేష్‌ వెల్లడించారు. నూతన కమిటీ జిల్లాలో ప్రభుత్వ విద్యా రంగం పరిరక్షణకై రాజీలేని పోరాటం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

నేరాలు ఘోరాలు

విద్యుత్ షాక్‌తో క్లీనర్ మృతి

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలంలోని చిన బ్రహ్మదేవం గ్రామంలో విద్యుత్ షాక్‌తో లారీ క్లీనర్ పెన్మెట్స నాగేశ్వరరావు(56) మృతి చెందినట్లు ఎస్ఐ మౌనిక తెలిపారు. కలకత్తా నుంచి బొగ్గు లోడుతో వచ్చిన లారీ బొగ్గును అన్‌లోడ్ చేసి చేవల కాలీ తొట్టెలను పాలకొట్లు లోడింగ్‌ వెళ్లేందుకు లోడింగ్ చేస్తున్న సమయంలో లారీ క్లీనర్ పైకి ఎక్కాడు. ఈ నేపథ్యంలో పైన ఉన్న విద్యుత్ లైన్‌ను తాకడంతో విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. దీంతో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు పశ్చిమగోదావరి జిల్లా కొదురు మండలం మట్టపర్రు వాసిగా గుర్తించామన్నారు. మృత దేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం పెద్దాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించామని, ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ చెప్పారు.

వరి కుప్ప దగ్ధంపై కేసు నమోదు

ప్రజాశక్తి - కోటనందూరు

మండలంలోని జగన్నాధపురం గ్రామ సమీపంలో వరి కుప్ప దగ్ధంపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ టి.రామకృష్ణ తెలిపారు. గ్రామానికి చెందిన రైతు బంగారు కొండబాబుకు చెందిన రెండు ఎకరాల్లో పండిన వరి పంటను కుప్పగా వేశారు. అయితే ఆదివారం రాత్రి ఆ కుప్ప దగ్ధం అయిపోయిందని ఫిర్యాదు చేశారు. దీంతో సంఘటనా ప్రాంతాన్ని సోమవారం సిఐ జి.చెన్నకేశవరావు, ఎస్ఐ టి.రామకృష్ణ సందర్శించారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి వరి కుప్ప ప్రమాదవశాత్తు తగలబడిందా? లేక ఎవరైనా తగలబెట్టారా? అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పేకాట శిబిరాలపై దాడి

ప్రజాశక్తి - వాగ్దు, ఆలమూరు

వాగ్దు గ్రామ శివారు కోళ్ల ఫారంలో ఆదివారం రాత్రి కొవ్వూరు రూరల్ ఎస్ఐ కె.శ్రీహరి తన సిబ్బందితో కలిసి పేకాట శిబిరాలపై దాడులు చేశారు. 26 మందిని అరెస్టు చేశారు. వారి నుంచి రూ.1.48 లక్షల నగదు, 26 సెల్ ఫోన్లు, నాలుగు బైకులను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేశామని స్టేషన్ రైటర్ పెదవలి శ్రీనివాస్ తెలిపారు. అలాగే ఆలమూరు మండలంలోని నర్సిపూడిలో పేకాట శిబిరంపై పోలీసులు నిర్వహించిన దాడిలో ఏడుగురిని అదుపులోనికి తీసుకుని కేసు నమోదు చేశారు. రావులపాలెం రూరల్ సిఐ సిహెచ్.విద్యాసాగర్‌కు వచ్చిన సమాచారం మేరకు ఎస్ఐ ఎం.అశోక్ సిబ్బందితో ఆదివారం అర్థరాత్రి నర్సిపూడిలో పేకాట శిబిరంపై దాడి చేశారు. ఏడుగురిని అదుపులోనికి తీసుకుని వారి వద్ద రూ.21,100లు నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

బాల్య వివాహం చేసుకున్న యువకుని అరెస్టు

ప్రజాశక్తి - రాజానగరం

బాల్య వివాహం చేసుకున్న ఒక యువకుడుని పోలీసులు అరెస్టు చేశారు. బాలికను జిల్లా బాలిక సంరక్షణ కేంద్రానికి పంపారు. ఈనెల 25న రాజానగరం మండలం కొత్తతుంగపాడుకు చెందిన దొడ్డా మణికంఠ అదే గ్రామానికి చెందిన 16 ఏళ్ల బాలికతో బంధువులు, పెద్దల సమక్షలో వివాహం చేశారు. వివాహ చట్టం ప్రకారం బాలికకు 21 ఏళ్ల నిండకపోవడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. రంగోటి ఐసిడిఎస్ సూపర్‌వైజర్ ఎస్కెబి.బేగం బాలికను జిల్లా బాలిక సంరక్షణ కేంద్రానికి పంపారు.

గడ్డి మందు తాగిన వ్యక్తి మృతి

ప్రజాశక్తి - సీతానగరం

గడ్డి మందు తాగిన వ్యక్తి చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో ఈ నెల 29న మృతి చెందాడు. కూనవరం గ్రామానికి చెందిన బుర్రి గరటయ్య(34) కొంతకాలం నుంచి మద్యానికి బానిసయ్యాడు. ఈనెల 28న కూనవరం సచివాలయం వద్ద పడిపోయి ఉన్నాడు. కుటుంబ సభ్యులు గమనించి చూడగా గడ్డి మందు తాగినట్లు గుర్తించారు. వెంటనే రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో ఈ నెల 29 సాయంత్రం మృతి చెందాడు. మృతునికి భార్య కుమారుడు ఉన్నారు. సోదరుడు బుర్రి ముత్యాలరాయుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రామ్‌కుమార్ తెలిపారు.

5 కేజీల గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి - కరప

మండలంలోని నడకుదురు గ్రామంలోని గంజాయి తరలిస్తున్న ఇద్దరిని అరెస్టు చేసి ఐదు కేజీలు గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు కరప ఎస్ఐ టి.సునీత తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం మధ్యాహ్నం 3.30 గంటలకు నడకుదురు గ్రామంలోని సాయిబాబా గుడి సమీపంలో తనిఖీలు నిర్వహిస్తుండగా అనుమానాస్పదంగా తిరుగుతున్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని తనిఖీ చేయగా, వారి వద్ద ఉన్న ప్లాస్టిక్ సంచిలో 5 కేజీల గంజాయిని గుర్తించినట్లు తెలిపారు. అల్లూరి సీతారామరాజు జిల్లా దుంబ్రిగూడ గ్రామానికి చెందిన కిల్లో క్రీను, కిల్లో రమేష్‌లను గుర్తించారు. ఇద్దరిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి రిమాండ్ విధించారని ఎస్ఐ తెలిపారు.

10 లీటర్ల సారా స్వాధీనం

ప్రజాశక్తి - గండేపల్లి

మండలం తాళ్లూరు గ్రామ శివారు మోటార్ సైకిల్‌పై సారా రవాణా చేస్తున్న వ్యక్తిని తనిఖీ చేసినా 10 లీటర్ల సారాను కలిగివుండటంతో అతనిని అదుపులోకి తీసుకుని సారాతోపాటు, ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ శివనాగ బాబు తెలిపారు. అతనిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపర్చినట్లు ఎస్ఐ తెలిపారు.

హత్యాయత్నం కేసులో రిమాండ్

ప్రజాశక్తి - శంఖవరం

మండలంలోని మండపం గ్రామంలో స్థల వివాదాల సంఘటనలో జరిగిన హత్యాయత్నం కేసులో ఇద్దరు ముద్దాయిలను అరెస్టు చేసినట్లు ఎస్ఐ పవన్‌కుమార్ తెలిపారు. వారి నుంచి హత్యాయత్నంకు ఉపయోగించిన ఆయుధాలను స్వాధీనం చేసుకున్నామని, వారిద్దరిని కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి రిమాండ్‌కు తరలించాలని ఆదేశించారు. ఈ కేసులో తదుపరి ఎటువంటి వివాదాలు గ్రామంలో తలెత్తకుండా పోలీస్ పికెటింగ్ కొనసాగిస్తున్నామని, గ్రామస్తులందరూ శాంతి భద్రతల సమస్యలు తలెత్తకుండా వ్యవహరించాలని సూచించారు.

భద్రతకు అధిక ప్రాధాన్యత : ఎస్‌పి

ప్రజాశక్తి - కాకినాడ


ఎస్‌పి విక్రాంత్ పాటిల్

జిల్లాలో ఉన్న ప్రజల భద్రతకు, రక్షణకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని ఎస్‌పి విక్రాంత్ పాటిల్ అన్నారు. సోమవారం స్థానిక పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పోలీసుల పనితీరు, చేపట్టిన అంశాలు, కేసుల వివరాల వార్షిక ప్రణాళికను ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ ఈ ఏడాది జరిగిన సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా జరగడం మంచి శుభ పరిణామని అన్నారు. పోక్సో చట్టంపై అవగాహన ఇచ్చామని, జిల్లాలోని పాఠశాలలో గుడ్, బ్యాడ్ టచ్ వంటి వాటిపై విద్యార్థులకు అవగాహన కల్పించినట్లు చెప్పారు. మహిళా రక్షణకు 35 టీముల ద్వారా 1 లక్ష 26 వేల మందికి పైగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించామని అన్నారు. 2023 సంవత్సరంలో ఎస్సి, ఎస్టి అట్రాసిటీ కేసులు 52 కేసులు నమోదు కాగా, ఈ ఏడాది 65 కేసులు నమోదు చేసి బాధితులకు న్యాయం చేశామన్నారు. గత ఏడాది రోడ్డు ప్రమాదాల్లో 36 మంది మృతి చెందగా, ఈ ఏడాది 295 మంది మృతి చెందారన్నారు. ప్రమాదానికి కారణమైన చోట రక్షణ చర్యలు తీసుకున్నామని, అక్కడ ప్రమాదాలు జరగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు. 2023లో తాగి వాహనం నడిపిన 5805 మందికి అపరాధ రుసుం విధించగా, ఈ ఏడాది 7879 మందికి అపరాధ రుసుము విధించామన్నారు. సైబర్ క్రైమ్ ద్వారా 2023లో రూ.8.32 కోట్లు నష్టం పోగా ఈ ఏడాది 26.57 కోట్లను పోగొట్టుకున్నారన్నారు. గంజాయి, డ్రగ్స్ కేసులకు సంబంధించి 1337 కిలోల గంజాయి స్వాధీనం చేసుకుని 87 మందిని అరెస్ట్ చేసి పీడీ జోళికి పోకుండా విద్యార్థులకు అవగాహన తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. ప్రతి స్టేషన్‌కి ఒక డ్రోన్ కెమెరా ఏర్పాటు చేయాలనుకుంటున్నామని వెల్లడించారు. అపార్ట్‌మెంట్ యజమానులు సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. తద్వారా దొంగతనాలు, నేరాలు నిరోధానికి ఎంతో తోడ్పడుతుందన్నారు. రానున్న నూతన సంవత్సర వేడుకలకు యువత మద్యం ఇతర వ్యసనాలకు దూరంగా ఉండి ఆనందంగా వేడుకలు చేసుకోవాలని ఎస్‌పి పిలుపునిచ్చారు.

రెవెన్యూ కార్యాలయం వద్ద కార్మికుల బైఠాయింపు

ప్రజాశక్తి - ఏలేశ్వరం


కార్మికులను నెట్టేస్తున్న పోలీసులు

మండలంలోని చిన్నింపేట జీడిపిక్కల ఫ్యాక్టరీ కార్మికులు సిఐటియు ఆధ్వర్యంలో మండల రెవెన్యూ కార్యాలయం వద్ద బైఠాయించారు. మూసివేసిన ఫ్యాక్టరీని తెరిపించాలని కోరుతూ గత 45 రోజులుగా వివిధ రూపాల్లో కార్మికులు ఆందోళన నిర్వహిస్తున్నారు. అయినా ప్రభుత్వం కానీ, యాజమాన్యం కానీ స్పందించకపోవడంతో ఉద్యమాన్ని తీవ్ర తరం చేస్తూ సోమవారం స్థానిక మండల రెవెన్యూ కార్యాలయం వద్ద కార్మికులు బైఠాయించారు. కార్యాలయం లోకి తహశీల్దార్‌తోపాటు, ఇతర ఉద్యోగులు వెళ్లకుండా కార్మికులు అడ్డుకున్నారు. దీంతో పోలీసులు రంగ ప్రవేశం చేసి అధికారులకు దారి ఇవ్వాలని కార్మికులతో వాగ్వాదానికి దిగారు. సిఐటియు నాయకుడు రొంగల ఈశ్వర రావుతో సహా పలువురు కార్మికులను పక్కకు లాగే ప్రయత్నం చేశారు. దీంతో ఉద్రిక్త పరిస్థితి నెలకుంది. ఈ నేపథ్యంలోనే తహశీల్దార్ వెంకటేశ్వర రావు జోనల్ కార్మిక శాఖ అధికారిణి రాణి దృష్టికి సమస్యను చరవాణి ద్వారా తీసుకెళ్లారు. ఈ నెల 6వ తేదీన ఫ్యాక్టరీ యాజమాన్యానికి, కార్మికులకు మధ్య చర్చలు జరిపి కార్మికులకు న్యాయం చేస్తామని ఆమె కార్మికులకు హామీ ఇచ్చారు. దీంతో కార్మికులు శాంతించారు. బైఠాయింపును విరమించారు. కార్మికుల ఆందోళనకు అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సెక్టర్ అధ్యక్షురాలు కాకరపల్లి సునీత ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలు మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి పాకలపాటి సోమరాజు, కార్మిక నాయకులు ఎ.వీరబాబు కె.చక్రధర్, గోవింద్, ధర్మాజీ, లోవరాజు, అన్నపూర్ణ, వరలక్ష్మి, సత్య, చంటి తదితరులు పాల్గొన్నారు.

అర్జీలను నాణ్యతతో పరిష్కరించాలి

ప్రజాశక్తి - కాకినాడ

పిజిఆర్ఎస్‌లో వచ్చే అర్జీలను నాణ్యతతో పరిష్కారం చూపాలని కలెక్టర్ షాన్‌మోహన్ సగిలి ఆదేశించారు. సోమ వారం కలెక్టరేట్‌లో నిర్వహించిన పిజిఆర్ ఎస్ కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ శాఖల్లో నమోదైన అర్జీలపై సంబంధిత అధికారులు సమగ్ర విచారణ జరిపి, అర్జీదారునికి సంతృప్తికరమైన పరిష్కారం చూపాలని ఆయన స్పష్టం చేశారు. మొత్తం-286 అర్జీలు అందాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా, డిఆర్ఓ జె.వెంకటరావు, హౌసింగ్ పీడీ ఎన్‌వివి.సత్యనారాయణ, కెఎస్ఇజెడ్ ఎస్‌డిసి కెవి.రామలక్ష్మి, సిపిఓ పి.త్రినాథ్, కలెక్టరేట్‌లోని వివిధ విభాగాలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన

ప్రజాశక్తి - గండేపల్లి

మండలంలోని నీలాద్రిరావుపేట గ్రామంలో చేపడుతున్న అభివృద్ధి పనులను గ్రామ సర్పంచ్ ముల్లంపాక సురేష్ గ్రామ కార్యదర్శి తరంగిణితో కలిసి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూ సహకారంతో గ్రామంలో రూ.50 లక్షలతో సిసి రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణాలను చేపట్టినట్లు తెలిపారు. ఆయా పనులను పూర్తి నాణ్యత ప్రమాణాలతో నిర్మించాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని కోరారు.

నేడు మండల స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన

ప్రజాశక్తి - గొల్లప్రోలు

స్థానిక జడ్‌పి బాలికోన్నత పాఠశాలలో మంగళవారం మండల స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు ఎంఇఒలు నాయుడు వెంకటేశ్వరరావు, బి.శివప్రసాద్ తెలిపారు. మండలంలోని 8 ప్రభుత్వ హైస్కూల్స్, 2 యుపి పాఠశాలలు, 5 ప్రయివేటు హైస్కూల్స్ మొత్తం 15 పాఠశాలలకు చెందిన విద్యార్థులు వైజ్ఞానిక ప్రదర్శనలో పాల్గొంటరాని తెలిపారు. సకాలంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు హాజరు కావాలని అన్నారు.

సాయాన్ని సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - కాజులూరు

పేద విద్యార్థులకు దాతలు అందిస్తున్న సాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని స్థానిక జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ ఎస్-ఎస్.శ్రీనివాస్ అన్నారు. సోమవారం కళాశాల లైబ్రేరియన్ భీమేశ్వరరావు స్నేహితుడు హైదరాబాదుకు చెందిన జామి రామకృష్ణ కళాశాలలో ప్రతిభ చూపుతున్న 9 మంది విద్యార్థులకు రూ.14,000/- ప్రోత్సాహక బహుమతిని అందించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, ఆఫీసు సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

గోపాలమిత్రలకు కనీస వేతనాలు చెల్లించాలి

ప్రజాశక్తి - కాకినాడ

గోపాలమిత్రలకు కనీస వేతనాలు చెల్లించాలని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా సిఐటియు ప్రధాన కార్యదర్శి ఎన్.బలరాం డిమాండ్ చేశారు. స్థానిక పశుసంవర్ధక శాఖ జిల్లా కార్యాలయంలో గోపాలమిత్ర సంఘం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా సర్వ సభ్యుల సమావేశం సిఐటియు ఆధ్వర్యంలో సోమవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోపాలమిత్రలు అనేక సంవత్సరాలుగా పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పనిచేస్తూ రైతులకు పలు అంశాలపై అవగాహన కల్పిస్తున్నారని అన్నారు. వీరిని రాష్ట్ర ప్రభుత్వం 4వతరగతి ఉద్యోగులుగా గుర్తించి రెగ్యులర్ చేయాలని, అప్పటి వరకు కనీసవేతనం రూ.26 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో కాకినాడ, కోనసీమ జిల్లా కమిటీలను ఏర్పాటు చేశారు. కాకినాడ జిల్లా అధ్యక్షులుగా బి.నానాజి, ఉపాధ్యక్షులుగా సత్య నాగకృష్ణ, ప్రధాన కార్యదర్శిగా ఎస్.సత్యన్నారాయణ, సహాయ కార్యదర్శిగా వై.సత్యన్నారాయణ, కోశాధికారిగా కెసిహెచ్.అప్పన్న, కమిటీ సభ్యులుగా ఎస్.వెంకటలక్ష్మి, బి.రాజబాబు, ఎస్.ప్రసాద్, బి.కాశీ విశ్వనాధం ఎన్నికయ్యారు. అలాగే డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అధ్యక్షులుగా సిహెచ్.సురేష్, ఉపాధ్యక్షులుగా సిహెచ్.మూర్తి, ప్రధాన కార్యదర్శిగా ఎం.రతన్‌రాజు, సహాయ కార్యదర్శిగా వై.శ్రీనివాసరావు, కోసాధికారిగా కె.వెంకటరావు, కమిటీ సభ్యులుగా వై.గోవింద్, ఎం.సంజీవరావు, సిహెచ్.రాజ్‌కుమార్, ఎం.శ్రీనివాస్, బి.వెంకటేశ్వరరావు, కె.గోపాలకృష్ణ ఎన్నికయ్యారు.

శ్రీఅగస్త్యలో ఫుడ్ ఫెస్టివల్

ప్రజాశక్తి - కాకినాడ


ఫుడ్ ఫెస్టివల్‌ను పరిశీలిస్తున్న విద్యా సంస్థల ఉద్యోగులు

పసిపిల్లల కేరింతలు, ఉపాధ్యాయుల ఉద్బోధల మధ్య సోమవారం స్థానిక శాంతినగర్ లోగల శ్రీఅగస్త్య వశిష్ట క్యాంపస్‌లో ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించారు. శ్రీఅగస్త్య విద్యా సంస్థల డైరెక్టర్ డి.నాగేశ్వరరావు సూచనల మేరకు ఈ ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించారు. ఈ ఫెస్టివల్‌ను ప్రారంభించిన ఆ సంస్థ ఉద్యోగి, సీనియర్ పాత్రికేయులు అల్లుమల్లు ఏలియా మాట్లాడుతూ చిన్నతనం నుంచే ఆహార అలవాట్లు, అలాగే షేరింగ్ అండ్ కేరింగ్ విధానం తెలుసుకునేందుకు ఇటువంటి ఫుడ్ ఫెస్టివల్స్ నిర్వహించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. స్కూల్ ప్రిన్సిపల్ పద్మజ, వైస్ ప్రిన్సిపల్ లక్ష్మి మాట్లాడుతూ ఫుడ్ ఫెస్టివల్ ద్వారా విద్యార్థుల్లో ఆహారపు విలువలు, ఆహారాన్ని తీసుకునే విధానం, ఆహారం తీసుకోవడంలో తెలుసుకోవాల్సిన జాగ్రత్తలను నేర్చుకునే అవకాశం ఉంటుందన్నారు. ఈ ఫెస్టివల్ ప్రతిష్టాత్మక రీతిలో నిర్వహించేందుకు సహకరించిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులు, నాన్ టీచింగ్ సిబ్బందికి ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీఅగస్త్య ఎడ్యుకేషనల్ సొసైటీ అధ్యక్షురాలు, మాథ్స్ ఫ్యాకల్టీ శ్రీపల్లవి, ఎజిఎం జివిఎస్‌తో పాటు బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

సిఐపై చర్యల కోసం న్యాయవాదుల ధర్నా

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

అనంతపురం త్రీ టౌన్ సిఐ శాంతిలాల్‌ను తక్షణమే కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని ఐలాజ్ ఆధ్వర్యంలో న్యాయవాదులు నిరసన వ్యక్తం చేశారు. సోమవారం స్థానిక మెజిస్ట్రేట్ కోర్టు వద్ద జరిగిన నిరసన కార్యక్రమంలో ఐలాజ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుగత శివ మాట్లాడుతూ అనంతపురంలో సీనియర్ న్యాయవాది బివి.శేషాద్రి కేసులో ఇరు వర్గాలు నోటీసులు పుచ్చుకోవడం జరిగిందన్నారు. దీనిపై వచ్చిన తప్పుడు ఫిర్యాదుపై న్యాయవాదులను స్టేషన్‌కు పిలిపించి వారి సెల్‌ఫోన్లను తీసుకుని వారిపై సిఐ శాంతిలాల్ దురుసుగా ప్రవర్తించడంతో ఒక న్యాయవాది అక్కడికక్కడే మృతి చెందారని అన్నారు. తక్షణమే సిఐపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర కోశాధికారి అవసరాల దేవి, బార్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ రవణం వీరవెంకటరావు, న్యాయవాదులు బండారు నరసింహరావు, కూచిమంచి సూర్యప్రకాశరావు, రాయి అచ్యుత రామారావు తదితరులు పాల్గొన్నారు.

పాలక మండలిని పట్టించుకోరా..?

ప్రజాశక్తి - తాళ్లరేవు

మండల పాలకమండలిని పక్కనపెట్టి అధికారుల ద్వారా పెత్తనం చలాయించడం తగదని పలువురు ఎంపిటిసిలు ధ్వజమెత్తారు. ఎంపిపి రాయుడు సునీత అధ్యక్షతన సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. మండలంలో చేపడుతున్న అభివృద్ధి పనులను ఎపిఒ తేజస్విని, మండల ఇంజనీర్ అప్పారావు వివరిస్తుండగా పలువురు ఎంపిటిసిలు అభ్యంతరం వ్యక్తం చేశారు. అభివృద్ధి పనుల చేపట్టే సమయంలో కనీసం ఎంపిటిసిలకు సమాచారం ఇవ్వకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కూటమి పార్టీల నాయకులు చెప్పిన పనులకే ప్రాధాన్యత ఇవ్వడాన్ని తప్పుబట్టారు. ఈ సమావేశంలో ఎంపిడిఒ సత్యనారాయణ, తహశీల్దార్ పి. త్రినాధరావు, వైస్ ఎంపిపికొపనాతి లలిత, ఎంఇఒ మంగాయమ్మ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

కాకినాడ రహదారికి మరమ్మతులు చేపట్టాలి

ప్రజాశక్తి - సామర్లకోట

సామర్లకోట - కాకినాడ ప్రధాన రహదారికి తక్షణమే మరమ్మతు పనులు చేపట్టాలని ఎఐఎండిఎస్ జాతీయ అధ్యక్షులు, టిడిపి నాయకుడు కాపవరపు కుమార్ కలెక్టర్‌ను కోరారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన పిజిఆర్ఎస్ కార్యక్రమంలో ఆయన వినతిపత్రాన్ని అందజేశారు. కాకినాడ రహదారిలో ప్రయాణించాలంటే ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని వెళ్లాల్సి వస్తుందని, తక్షణమే రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని, లేనిపక్షంలో నిరవధిక నిరహారదీక్ష చేపడతానని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అడబాల వీరభద్రరావు, ఆర్‌కె. సురేష్, శ్రీను పాల్గొన్నారు.

ఘనంగా ఎస్ఎఫ్ఐ ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి - పిఠాపురం

ఎస్ఎఫ్ఐ 55వ ఆవిర్భావ దినోత్సవాన్ని సోమవారం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక ఆర్ఆర్‌బిహెచ్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో తొలుత స్వాతంత్ర్యం, ప్రజాస్వామ్యం, సోషలిజం అనే ఆశయాలతో ఉన్న జెండాను ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షురాలు, జిల్లా గర్ల్స్ కన్వీనర్ జి.చిన్ని ఆవిష్కరించారు. విద్యార్థుల సమస్యలపై పోరాడుతూ మరణించిన అమరవీరులకు నివాళిగా ఒక్క నిమిషం మౌనం పాటించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు జి.శ్రీకాంత్, ఉపాధ్యక్షులు కె.సిద్దు మాట్లాడారు. ఎస్ఎఫ్ఐ ఏర్పడిన నాటి నుంచి నేటి వరకు ప్రభుత్వ విద్యా పరిరక్షణ, విద్యార్థుల సమస్యల పరిష్కారానికై అరుపెరగని పోరాటాలు చేస్తుందన్నారు. దేశం కోసం ప్రాణాలర్పించిన ఎంతోమంది స్ఫూర్తితో నేడు విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాడుతుందన్నారు. అందరికీ విద్యా ఉపాధి అవకాశాల కోసం పోరాడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు ప్రకాష్, ప్రేమ్‌కుమార్, వెంకటేష్, రమణ, మహేష్, శశి, సుభాష్, కమల, సింధు, నాగమణి పాల్గొన్నారు.

శనగ పంటలపై అవగాహన

ప్రజాశక్తి - గండేపల్లి

శనగ పంటపై రైతులు పూర్తి అవగాహన కలిగి ఉండాలని వ్యవసాయ అధికారి సద్గురుమూర్తి అన్నారు. సోమవారం మండలంలోని జెడ్.రాగంపేటలో జాతీయ ఆహార భద్రతా మిషన్-క్షేత్ర ప్రదర్శన కేంద్రాన్ని ఆయన సందర్శించారు. శనగ పంట కొమ్ములు వేసేదశలో విధిగా ఒక తడి పెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవ సాయ సహాయకులు ఎస్.సురేఖ, రైతులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ కబడ్డీ రిఫరీకి ఘన స్వాగతం

ప్రజాశక్తి - సామర్లకోట

అంతర్జాతీయ కబడ్డీ రిఫరీగా వ్యవహరించి తొలిసారిగా సోమవారం స్వస్థలానికి వచ్చిన భోగిళ్ళ మురళీకుమార్‌కు ఘనస్వాగతం లభించింది. మధురపూడి విమానాశ్రయం నుంచి పట్టణానికి చేరుకున్న ఆయనకు జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షులు డివివిఎస్.శ్రీనివాస్, సెక్రటరీ కొండపల్లి శ్రీనివాసరావు, కోశాధికారి నిమ్మకాయల కిరణ్‌కుమార్, కోచ్ సాయిప్రసాద్, రాష్ట్ర కబడ్డి సంఘ సభ్యులు, జిల్లా కబడ్డి సంఘ సభ్యులు, తదితరులు స్వాగతం పలికారు.

న్యాయవాదులపై దాడికి ఖండన

ప్రజాశక్తి - పిఠాపురం, ప్రత్తిపాడు

అనంతపురంలో న్యాయవాదులపై జరిగిన దాడిని ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఐలు) ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.ధర్మారెడ్డి, జిఎస్.భాస్కరాచార్యులు సోమవారం ఒక ప్రకటనలో ఖండించారు. న్యాయవాదుల పట్ల అనంతపురం త్రీ టౌన్ పోలీసులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఐలు) జిల్లా కార్యదర్శి ఆకాశపు మల్లేశ్వరరావు ఓ ప్రకటనలో ఖండించారు.

భోజన నిర్వహణ కార్మికులకే ఇవ్వాలి

ప్రజాశక్తి - పిఠాపురం

ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం నిర్వహణను కార్మికులకే ఇవ్వాలని ఎపి మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్(సిఐటియు) జిల్లా కార్యదర్శి ఎన్.ఈశ్వరి అన్నారు. సోమవారం మండల ఎంఆర్‌సి భవన్ వద్ద ధర్నా నిర్వహించి అనంతరం ఎంఇఒ శ్యాంబాబుకు వినతిపత్రం అందజేశారు. ఈ సంద ర్భంగా ఈశ్వరి మాట్లాడుతూ ప్రస్తుతం అల్లూరి సీతారామరాజు ట్రస్ట్ నుంచి భోజనాలు వస్తున్నాయని, పిల్లలు ఆ భోజనాన్ని తినలేక బయట ఎక్కువగా పారవేయడం జరుగుతుం దన్నారు ఈ కార్యక్రమంలో ఎస్.సుజాత, సీత, ఎస్.శ్రీనివాస్, లోకరెడ్డి నాగమణి, గీసాల దేవుడమ్మ, రాజ్యలక్ష్మి, కె.సునీత, డి శైలజకుమారి, డి.సుశీల పాల్గొన్నారు.

రూ.4 కోట్లతో రహదారుల నిర్మాణం

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

మండలంలో రహదారుల నిర్మాణానికి రూ.4 కోట్లు కేటాయించినట్లు ఎంఎల్ఎ వరుపుల సత్యప్రభ తెలిపారు. సోమవారం ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గత ప్రభుత్వంలో మండలంలో రహదారులు పూర్తి నిర్లక్ష్యానికి గురయ్యాయని అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం ఆరు నెలలు కాలంలోనే రహదారుల అభివృద్ధికి రూ.4 కోట్లు మంజూరు చేయించినట్లు తెలిపారు. త్వరలోనే రహదారుల పనుల నిర్మాణాలను ప్రారంభిస్తామని చెప్పారు.

విద్యా వైజ్ఞానిక ప్రదర్శన

ప్రజాశక్తి - కోటనందూరు

స్థానిక జడ్‌పి హైస్కూల్‌లో మండల స్థాయి విద్య వైజ్ఞానిక ప్రదర్శన సోమవారం నిర్వహించారు. ఈ ప్రదర్శన తహశీల్దార్ టి సుభాష్, ఎంపిడిఒ పి.వెంకటనారాయణ ప్రారంభిం చారు. విద్యార్థులు విభిన్న రకాల నమూనాలను తయా రుచేసి ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒలు శ్రీనివాస్, రామశేఖర్, హెచ్ఎం వేణుగోపాల్, పాల్గొన్నారు.